# బీఆర్ఎస్ నాయకుల విస్తృత ప్రచారం



నగరంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఖలీల్‌వాడి, నవంబర్ 5 : బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఇంటింటి ప్రచారం కొనసాగుతున్నది. నగరంలోని అన్ని డివిజన్లలో కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు ఆదివారం ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో నగరంలోని ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా చేపట్టిన అభివృద్ధితోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి వివరించారు. కారు గుర్తుకే ఓటు వేసి, బిగాల గణేశ్ గుప్తాను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, నవంబర్ 5 : జిల్లాకేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు, డిచ్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ, తెలుగు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్, కామర్స్, బాటనీ, కెమిస్ట్రీ, బోధన్ ప్రభుత్వ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీ 50 శాతం) కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. నెట్, సెట్, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఈనెల 8వ తేదీన గిరిరాజ్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు వారి దరఖాస్తుకు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లను జత చేసి ఈనెల 7వ తేదీలోగా కళాశాలలో అందజేయాలని సూచించారు.

## జిల్లా స్థాయి చెస్ పోటీలు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 5 : అండర్ –13 జిల్లా స్థాయి చెస్ పోటీలను ఆదివారం నిర్వహించినట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రమేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వీక్లీ బజార్‌లో ఉన్న సన్‌ఫ్లవర్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథులుగా పీజీహెచ్‌ఎం గంగారాం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగీతారావు హాజరయ్యారు. చెస్‌పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ముఖ్యఅతిథులు అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ప్రతినిధులు పి.గంగాధర్, బ్రహ్మానందం, పీఈటీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ఖలీల్‌వాడి, నవంబర్ 5 : జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్ శాలివాహన (యువజన) కుమ్మరి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సభ్యులుగా అంజయ్య, నర్సింహులు, యాదగిరి, సాయినాథ్, బాల్‌రాజు, ప్రమోద్‌కుమార్, నవీన్‌కుమార్, మణికాంత్, గంగాధర్, శేఖర్, సంతోష్, శ్రీనివాస్, భార్గవ్, రాజేశ్, రాహుల్, మనోజ్‌కుమార్, సాయిలు, ఆకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ కార్యవర్గం..

ఖలీల్‌వాడి, నవంబర్ 5 : దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి. శంకర్ రాజు, ప్రధానకార్యదర్శిగా కృష్ణమూర్తి, కోశాధికారిగా పి.బసవయ్య, ఉపాధ్యక్షులుగా ఎ.బాబూరావు, ఎస్.శ్రీనివాస్, ఎ.లక్ష్మణ్, బి. కృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కె.హన్మాండ్లు, పండరి, కోటిరెడ్డి, గోపాల్, మహిళా సెక్రటరీలుగా బి. సాయిప్రసన్న, ముఖ్య సలహాదారులుగా రాజన్న, పెరుమాల్ స్వామి, ప్రమోద్‌కుమార్, అప్పారావు, వెంకటి, మల్లుగొండ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్లుగా విధులు నిర్వర్తించిన కె. విజయ్‌కుమార్, పి.రాజన్న తెలిపారు. నూతన కార్యవర్గం మూడు సంవత్సరాలపాటు కొనసాగుతుందని తెలిపారు.

# నగరంలో పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది

నిజామాబాద్ క్రైం, నవంబర్ 5 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా స్థానిక పోలీసులు.. కేంద్ర బలగాలైన రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి నగరంలో ఆదివారం కవాతు నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీలు జయరాం, గిరిరాజ్, ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. నగరంలోని త్రీ టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో రాపిడ్ యాక్షన్స్ ఫోర్స్ సిబ్బంది పోలీస్ బలగాలతో కవాతు చేసింది. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ నగర సీఐ నరహరి, సౌత్ రూరల్ సీఐ వెంకటరమణ, నార్త్ సీఐ సతీశ్ కుమార్, త్రీ టౌన్, ఐదో టౌన్, మాక్లూర్, రూరల్ ఎస్సైలు ప్రవీణ్, అప్పారావు, సుధీర్‌రావు, మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం మత్తులో హోర్డింగ్ ఎక్కి యువకుడి హల్‌చల్

■ నగర సీఐ చొరవతో కిందికి దింపిన సిబ్బంది



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నరహరి, ఇన్‌సెట్‌లో హోర్డింగ్‌పై పడుకున్న రవీందర్

నిజామాబాద్ క్రైం, నవంబర్ 5 : జిల్లాకేంద్రంలో ఓ యువకుడు ఫుల్లుగా మద్యం తాగి డివైడర్‌పై ఉన్న హోర్డింగ్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. సదరు యువకుడు హోర్డింగ్ పైకి ఎక్కి దానిపై పడుకొని అరవడంతో గమనించిన స్థానికులు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతానికి చెందిన రవీందర్ అనే యువకుడు వృత్తి రీత్యా పెయింటర్‌గా పనిచేస్తాడు. అయితే తనకు ఓ వ్యక్తి వెయ్యి రూపాయలు ఇవ్వాల్సి ఉందని, తనకు డబ్బులు ఇవ్వకపోవడంతో కంఠేశ్వర్ చౌరస్తాలోని ఓ హోర్డింగ్‌పైకి ఎక్కి పడుకోవడం, నిలబడడడం చేస్తూ స్థానికులను భయాబ్రాంతులకు గురిచేశాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ నరహరి.. రవీందర్‌తో మాట్లాడి డబ్బులు ఇప్పిస్తానని నచ్చజెప్పి, హోర్డింగ్‌పై నుంచి కిందికి దిగేలా చూశారు. అనంతరం రవీందర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. సదరు యువకుడు గతంలో సైతం ఇలాగే హోర్డింగ్ పైకి ఎక్కి హంగామా చేయడంతో త్రీ టౌన్ ఎస్సైగా ఉన్న సంతోష్‌కుమార్ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## గాయత్రీ బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడిగా శ్రీనివాస్‌శర్మ



ఎన్నికల అధికారి యుగంధర్‌ను సన్మానిస్తున్న నూతన కార్యవర్గం

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 5 : ఇందూరు గాయత్రీ బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడిగా బాహి శ్రీనివాస్‌శర్మ ఎన్నికైనట్లు సమాఖ్య ఎన్నికల అధికారి యుగంధర్ తెలిపారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అర్చక సమాఖ్య ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఆయాచితం శ్రీహరిశర్మ, సెక్రటరీగా పిట్టల సుభాష్‌శర్మ, జాయింట్ సెక్రటరీగా జోషి రవీందర్, కోశాధికారిగా భాష్యం కృష్ణమాచార్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల్లో సుమారు 160 మంది సభ్యులు పాల్గొన్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని గౌరవాధ్యక్షుడు వేలేటి పశుపతి శర్మ, పవన్‌శర్మ, ప్రశాంత్‌జోషి, అజయ్ సంగ్వాయ్ తదితరులు అభినందించారు.

## సైకియాట్రిక్ జాతీయ కాంగ్రెస్ సదస్సు

■ హాజరైన డాక్టర్ ఆకుల విశాల్



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఆకుల విశాల్

ఖలీల్‌వాడి, నవంబర్ 5 : దేశంలోని ప్రైవేట్ సైకియాట్రిస్ట్‌ల 24వ వార్షిక జాతీయ కాంగ్రెస్ గోవాలోని పానాజీలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి నగరానికి చెందిన సైకియాట్రిస్ట్ డాక్టర్ ఆకుల విశాల్ హాజరయ్యారు. మానసిక చికిత్సకు సంబంధించిన నూతన పద్ధతులపై చర్చించారు. యాంటిడిప్రెసెంట్స్, కాంబినేషన్ థెరపీ తదితర అంశాలపై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, డాక్టర్ ఇండ్ల విశాల్ పలు అంశాలపై అప్‌డేట్ ఇచ్చారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులు బృందాన్ని ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణకు చెందిన డాక్టర్ కిషన్, డాక్టర్ ఫణికాంత్, డాక్టర్ మిన్హాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా

- జిల్లావ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూం..
- మద్యం, సారాయి, గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం
- ఇప్పటివరకు రూ.69 లక్షల 77 వేల విలువైన మత్తు పదార్థాలు సీజ్



సారాయి తయారు అడ్డాలపై దాడులు చేసిన అధికారులు, సిబ్బంది (ఫైల్)

నిజామాబాద్ క్రైం, నవంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, సారాయి, గంజాయి తరలించకుండా నిజామాబాద్ జిల్లా అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ్ పర్యవేక్షణలో అసిస్టెంట్ కమిషనర్ కిషన్ సూచనల మేరకు సూపరిటెండెంట్ కె.మల్లారెడ్డి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. గత నెల 9వ తేదీన ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో ఎక్సైజ్ శాఖ తమ బృందాలను రంగంలోకి దింపింది. దీంతోపాటు విస్తృతంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీ మొత్తంలో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యంతో పాటు సారాయి, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 165 లీటర్ల నాటు సారాయి, 21,525 లీటర్ల బెల్లం ఊట, 19,905 లీటర్ల కల్లు, 412.13 లీటర్ల మద్యం, 408.85 లీటర్ల బీరు, 5.61 లీటర్ల దేశీదారు, 7.93 లీటర్ల మహారాష్ట్ర నాన్ డ్యూటీ లిక్కర్, 1,266 కేజీల సారాయి తయారీకీ ఉపయోగించే నల్ల బెల్లం, 179 కేజీల పటిక, 5 కేజీల క్లోరల్ హైడ్రేట్, 54.4 కేజీల గంజాయి, 20 గంజాయి మొక్కలను పట్టుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. వీటితోపాటు 2 ఫోర్ వీలర్లు, 6 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సీజ్ చేసిన ఈ మత్తు పదార్థాల విలువ రూ.69 లక్షల 77 వేల 255 ఉంటుందని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మల్లారెడ్డి వెల్లడించారు. అక్రమంగా మద్యం, గంజాయి తదితర వాటిని తరలిస్తే ఫిర్యాదుల స్వీకరణ కోసం 24 గంటల పాటు పనిచేసేలా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 08462–237601 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.